క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరిక



మాజీ వైస్ ఎంపీపీ రెడ్డప్పరెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న వేణురెడ్డి

హిందూపురం: హిందూపురం మండల టీడీపీ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ రెడ్డప్పరెడ్డి టీడీపీకి గుడ్ బై చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హనుమంత రాయప్ప ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు వైఎస్సార్‌సీపీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు.

మడకశిర పట్టణంలో...



వైఎస్సార్‌సీపీలో చేరుతున్న కుంచిటి వక్కలిగలు

మడకశిర: నియోజకవర్గంలోని కుంచిటి వక్కలిగలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో భారీగా చేరారు. టీడీపీ, కాంగ్రెస్‌కు చెందిన కార్యకర్తలు ఆయా పార్టీలకు గుడ్‌బై చెప్పి వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం మడకశిరలో జరిగిన కుంచిటి వక్కలిగల ఆత్మీయ సమావేశంలో వారు సంఘం అధ్యక్షుడు అనంతరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, పార్టీ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్ తదితరులు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

దప్పిక తీర్చడమే లక్ష్యంగా..



వాటర్ ట్యాంకర్‌తో గుంతలకు నీరు నింపుతున్న దృశ్యం

పావగడ: తీవ్ర వర్షాభావం, వేసవి తాపం మనుషులకే కాదు పశు పక్ష్యాదులకు కూడా శాపంగా మారాయి. బోరు బావుల్లో జలాలు అడుగంటి పోయి తాగునీటికి మనుషులు అల్లాడి పోతుంటే మరోవైపు వన్య ప్రాణులు, పశు పక్ష్యాదులు తాగు నీరు లభించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక హసిరు క్రాంతి స్పోర్ట్స్ అసోసియేషన్ మూగ జీవుల దప్పిక తీర్చడమే లక్ష్యంగా ముందడుగు వేసింది. ఆ సంస్థ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ జీపీ వెంకటేష్ తదితరుల ఆధ్వర్యంలో పట్టణ పరిసర ప్రాంతాల్లోని ఎండుకు పోయిన నీటి గుంతల్లో నీటి ట్యాంకర్ల ద్వారా నీరు నింపు తున్నారు. అలాగే కొండలు, గుట్టల ప్రాంతాల్లో కూడా గుంతలు తవ్వి నీటిని నింపి మూగ జీవాల దాహార్తి తీరుస్తున్నారు.

ఘనంగా బసవ జయంతి



అమరాపురం: బసవేశ్వరునికి అభిషేకం చేస్తున్న దృశ్యం

అమరాపురం/గుడిబండ/అగళి: వీరశైవ లింగాయతుల ఆరాధ్య దేవుడు బసవేశ్వరస్వామి జయంతి వేడుకలను ఆ కులస్తులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తిరువీధి రథంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని కూర్చొబెట్టి గ్రామ వీధుల గుండా ఊరేగించారు. మరోవైపు గుడిబండలోనూ బసవ జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బసవన్న చిత్రపటాన్ని ఘనంగా ఊరేగించారు. అలాగే అగళి, మధూడి గ్రామాల్లో వెలసిన అతి పురాతనమైన బసవన్న గుడిలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అభివృద్ధిలో అగ్రగామి మడకశిర

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మారిన పట్టణ రూపురేఖలు
- సీసీ రోడ్లు, ఆస్పత్రుల నిర్మాణానికి రూ.కోట్ల ఖర్చు
- నాడు–నేడుతో 16 పాఠశాలలకు నూతనశోభ
- అన్నింటా అభివృద్ధి చెందడంపై ప్రజల హర్షం



మడకశిరలో నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆస్పత్రి

మడకశిర: వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత మడకశిర నగర పంచాయతీకి మహర్దశ పట్టింది. పట్టణ రూపురేఖలు మారడంతో అభివృద్ధిలో మడకశిర అగ్రగామిగా నిలిచింది. రోడ్లు, డ్రైనేజీలు అభివృద్ధి చెందాయి. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం, అర్బన్ హెల్త్ సెంటర్, అగ్రి ల్యాబ్ ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.

రూ.20 కోట్లతో వంద పడకల ఆస్పత్రి

మడకశిరలో టీడీపీ హయాంలో 50 పడకల ఆస్పత్రి మాత్రమే ఉండేది. అయితే వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆస్పత్రి స్థాయిని వంద పడకలకు పెంచారు. అంతే కాకుండా భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 20 కోట్లు మంజూరు చేశారు. భవన నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి.

రూ.68 కోట్లతో తాగునీటి పథకం

టీడీపీ హయాంలో ప్రజలు తాగునీటికి అష్టకష్టాలు పడేవారు. సమస్య గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శాశ్వత తాగునీటి పథకాన్ని మంజూరు చేసింది. ఏఐఐబీ(ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్టిమెంట్ బ్యాంక్) పథకం కింద రూ.68 కోట్లు మంజూరు చేసింది. దీనికి సంబంధించి పనులు వేగంగా జరుగుతున్నాయి.

16 పాఠశాలల అభివృద్ధి

మడకశిర నగర పంచాయతీ పరిధిలోని పాఠశాలలను నాడు–నేడు నిధులతో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారు. 16 పాఠశాలల అభివృద్ధికి రూ.8 కోట్లు ఖర్చు చేయడంతో స్కూళ్లు సరికొత్తగా మారాయి.

అర్బన్ హెల్త్ సెంటర్ తో వైద్యసేవలు

టీడీపీ హయాంలో అర్బన్ హెల్త్ సెంటర్ లేక పట్టణ ప్రజలు ఇబ్బంది పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి వచ్చాయి. అలాగే రూ.కోటి ఖర్చు చేసి అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడంతో రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారింది.

రూ.2 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

మడకశిర నగర పంచాయతీ పరిధిలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 20 వార్డుల పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.2 కోట్ల వరకు ఖర్చు చేశారు. రూ.కోటి ఎస్‌ఎఫ్‌సీ నిధులతో కూడా సీసీ రోడ్లను నిర్మించి పట్టణ అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు.

మరికొన్ని అభివృద్ధి పనులు ఇలా...

పట్టణంలో టీడీపీ హయాంలో కూల్చి వేసిన బాలికోన్నత పాఠశాల నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దాదాపు రూ.2 కోట్లతో భవన నిర్మాణ పనులు చేపట్టారు. అలాగే పట్టణంలో మరుగుదొడ్లు లేక ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడే వారు. గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.5 లక్షలతో రాజీవ్‌గాంధీ సర్కిల్‌లో మరుగుదొడ్లను నిర్మించింది. మరోవైపు దాదాపు 291 మంది పేదలు వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకుంటున్నారు.



మడకశిరలో ఏర్పాటు చేసిన అగ్రి ల్యాబ్



మడకశిర పట్టణంలో ఓ వీధిలో సీసీ రోడ్లు వేస్తున్న దృశ్యం

మడకశిర నగర పంచాయతీ అభివృద్ధి ఇలా...

మడకశిర నగర పంచాయతీ జనాభా:	30 వేలు
కుటుంబాల సంఖ్య:	10 వేలు
వార్డు సచివాలయాల సంఖ్య:	06
అర్బన్ హెల్త్ క్లినిక్‌లు:	01
వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు:	01
నాడు–నేడుతో అభివృద్ధి చెందిన పాఠశాలలు:	16
వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి మంజూరైన నిధులు:	రూ. 20 కోట్లు
సీసీ రోడ్ల నిర్మాణానికి ఖర్చు చేసింది :	రూ. 2 కోట్లు
శాశ్వత తాగునీటి పథకానికి మంజూరైంది :	రూ.68 కోట్లు

అన్ని విధాలుగా అభివృద్ధి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మడకశిర నగర పంచాయతీ అన్ని విధాలుగా అభివృద్ధి చెందింది. సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.2 కోట్ల వరకు ఖర్చు చేశాం. రూ.68 కోట్లతో తాగునీటి పథకం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం. ఒక్క మాటలో చెప్పాలంటే అభివృద్ధిలో మడకశిర అగ్రగామిగా నిలిచింది. – లక్ష్మీనరసమ్మ, చైర్‌పర్సన్, మడకశిర నగర పంచాయతీ

ఇబ్బందులు తొలగాయి



గతంలో సీసీ రోడ్లు లేక నడవడానికి కూడా ఇబ్బంది పడే వాళ్లం. ప్రస్తుతం అన్ని వార్డుల పరిధిలో కూడా సీసీ రోడ్లను నిర్మించారు. రాత్రి వేళల్లో కూడా సులభంగా వెళ్లి రావడానికి అవకాశం ఏర్పడింది. సీఎం జగన్ చొరవతోనే మడకశిరలో సీసీ రోడ్ల నిర్మాణం జరిగింది.

– రవీంద్రారెడ్డి, వడ్రపాళ్యం

అందుబాటులో వైద్య సేవలు



మడకశిరలో ప్రభుత్వం అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయడంతో వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో అర్బన్ హెల్త్ సెంటర్ లేక ఎన్నో ఇబ్బందులు పడ్డాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదల వైద్యానికి పెద్ద పీట వేయడం హర్షణీయం.

– అహమ్మద్ అలీ, మడకశిర

జగనన్న హయాంలోనే అభివృద్ధి



జగనన్న హయాంలోనే మడకశిర అన్ని విధాలుగా అభివృద్ధి చెందింది. పట్టణ అభివృద్ధికి రూ.వందల కోట్లు ఖర్చు చేశారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణంతో పేదలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడానికి అవకాశం ఏర్పడింది.

– ప్రేమ, మడకశిర

మడకశిర మండలంలో టీడీపీకి షాక్



ఏఆర్ రొప్పంలో పార్టీలో చేరిన వారితో రవిశేఖర్‌రెడ్డి



ఆర్ అనంతపురంలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో గోవర్ధన్‌రెడ్డి

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఏఆర్ రొప్పం, ఆర్ అనంతపురం గ్రామాల్లో టీడీపీకి షాక్ తగిలింది. 40 కుటుంబాలు టీడీపీని వీడి సర్పంచులు గీత, అంజినమ్మ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైఎన్ రవిశేఖర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఏఆర్ రొప్పం టీడీపీ నుంచి వడ్డే మల్లేశ్వర, నాగప్ప, నాగభూషణ్, అంజినప్ప, పుట్టమ్మ, కురుబ రంగప్ప, అలాగే ఆర్. అనంతపురంలో హరి, సూరి, హనుమంతులు పార్టీలోకి చేరారు. పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, సర్పంచ్ కరణాకర్‌గౌడ్, జేసీఎస్ కన్వీనర్ తిమ్మప్ప, నాయకులు శివగంగప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి ఓటేస్తే మరింత మంచి



పార్టీలో చేరిన వారితో నవీన్‌నిశ్చల్, పోకుల అశోక్‌కుమార్

గుడిబండ: మండల పరిధిలోని పళారంలో టీడీపీ యువ నాయకుడు రమేష్ శుక్రవారం వైఎస్సార్‌సీపీ పార్టీలో చేరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నవీన్‌నిశ్చల్ మాట్లాడుతూ జగనన్నకు పట్టంకడితే పేదలకు మరింత మంచి చేస్తారన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు పోకుల అశోక్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, మండల కన్వీనర్ డీఎల్ యం జారేగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘పురం’పై ఎగిరేది వైఎస్సార్‌సీపీ జెండానే..



చిలమత్తూరు: భారీ వర్షంలోనే ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపిక

- ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపిక
- చిలమత్తూరులో భారీ వర్షంలోనూ రోడ్ షో

చిలమత్తూరు: నియోజకవర్గ ప్రజల మద్దతుతో ‘పురం’ కోటపై ఈసారి ఎగిరేది వైఎస్సార్‌సీపీ జెండానేనని ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపిక ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని రసలపల్లి, సుబ్బరావుపేట, శెట్టిపల్లి, కమ్మయ్యగారిపల్లి, తిమ్మాడపల్లి, బీదరెడ్డిపల్లి, పెద్దనపల్లి, కనిశెట్టిపల్లి, టెక్స్‌పోర్ట్ గార్మెంట్స్, చిలమత్తూరు టౌన్‌లలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో ప్రజలు ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలకృష్ణ స్థానికంగా ఉండే వ్యక్తి కాదని, ఏదైనా సమస్య ఉంటే హైదరాబాదుకు వెళ్లాల్సిందేనన్నారు. ఆయన పీఏలు కూడా ఇక్కడి ప్రాంతానికి చెందిన వారు కాదన్నారు. తనకు ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే... తన ఇంటి తలుపు తడితే చాలు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పే బూటకపు హామీలు నమ్మొద్దని, ఇచ్చిన ఏ హామీ కూడా నెరవేర్చడని విమర్శించారు. మళ్లీ జన్మభూమి కమిటీల చేతుల్లోకి వ్యవస్థలను పెట్టేస్తాడని, ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు. ఏ గ్రామంలోకి వెళ్లినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేరే వినబడుతోందని, 40 ఏళ్ల చరిత్ర ఈ ఎన్నికల్లో భూస్థాపితం అవబోతోందన్నారు. ఇకపై పురం టీడీపీ కంచుకోట కాదని, ఇసుక మేట అని అది కూలిపోబోవతోందని స్పష్టం చేశారు. తనతో పాటు ఎంపీ అభ్యర్థి శాంతమ్మకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విన్నవించారు. పాలేపల్లిలో నారాయణప్ప అనే వికలాంగుడు మండుటెండలో ప్రచారంలో పాల్గొనేందుకు రాగా దీపిక ప్రచార రథం దిగి ఆయన బాగోగులు తెలుసుకున్నారు. ఏ కష్టం వచ్చినా తన వద్దకు రావాలని అండగా ఉంటానని హామీ ఇచ్చారు. భూమయ్యగారిపల్లిలో ప్రచారంలో గాయపడిన నరేష్ అనే యువకుడిని అతని ఇంటికెళ్లి పరామర్శించారు.

జగన్ పాటకు టీడీపీ కార్యకర్తల స్టెప్పులు

మొరసలపల్లి పంచాయతీలోని పాలేపల్లి వద్ద ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి టీఎన్ దీపిక, ఎమ్మెల్యే బాలకృష్ణ ఎదురు పడ్డారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు జెండలు జతకట్టడమే మీఎజెండా పాట పెట్టడంతో టీడీపీ కార్యకర్తలు కూడా స్టెప్పులేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఫ్యాన్ సింబల్ చూపించగా వారిలో కొందరు ఫ్యాన్‌ను చూపుడు వేలితో తిప్పుతూ డ్యాన్స్ చేశారు. ఇదంతా చూసిన బాలకృష్ణ అభివాదం చేసుకుంటూ ముందుకు వెళ్లిపోయారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

భారీ వర్షంలోనే రోడ్ షో

మండల కేంద్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి టీఎస్ దీపిక వేలాది మంది నడుమ రోడ్ షో నిర్వహించారు. చెన్నంపల్లి క్రాస్‌లోని పార్టీ కార్యలయం వద్ద నుంచి చిలమత్తూరు వరకూ ర్యాలీ నిర్వహించారు. సుమారు మూడు గంటల పాటు భారీ వర్షంలో తడుస్తూనే రోడ్ షో కొనసాగించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, రాష్ట్ర కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, మండల కన్వీనర్ రాజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు జగన్మోహన్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, మంజునాథ్‌రెడ్డి, ఆదినారాయణ, సర్పంచ్ మురళి, సంధ్య, తిరుమలేష్, శంకర్‌రెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ హనుమంతరెడ్డి, నాయకులు గిరిధర్‌రాజు, అశ్వర్థరెడ్డి, హరి, షాకీర్, నరి, నయీ ముల్లా, శంకర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండలంలోని గలిబిపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో శుక్రవారం రాత్రి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక ప్రచారం చేశారు. చంద్రబాబు చెప్పే మాయమాటలకు మోసపోవద్దని, టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు కట్ అవుతాయన్నారు. జగనన్నతోనే సంక్షేమాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణ స్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ ఆదినారాయణ, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు పద్మావతమ్మ, నాయకులు బోర్ల అంజనరెడ్డి, చలపతి, మోహన్, అంజినప్ప, వెంకటేశ్, శ్రీనివాసులు, నరసప్ప, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టండి



ఆలూడిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

- ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

అగళి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా సంక్షేమ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని ఆలూడిలో ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు ఇంటి ముంగిటకే అందించారన్నారు. విద్యా, వైద్య రంగాలు బలోపేతమయ్యాయని, పేదల పిల్లలకు నాణ్యమైన విద్య ఉచితంగా అందుతోందన్నారు. హామీల్లో 99 శాతం హామీలను నెరవేర్చిన ఏకైక సీఎం జగనేనన్నారు. టీడీపీ, కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దని కోరారు. తనతో పాటు ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, సర్పంచులు బసవరాజు, సుజత, శివకుమార్, ఎంపీటీసీ సభ్యురాలు నింగమ్మ, ఎంపీటీసీ భర్త బసవరాజు, నాయకులు సదానంద్ ఆరాధ్య, నగేంద్ర, మంజునాథ, శ్రీనివాస్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు

గుడిబండ: మండల పరిధిలోని మందలపల్లిలోని జామియా మసీదులో గ్రామ మత పెద్దలతో కలిసి శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు ఆయన్ను ఆశీర్వదించారు.

టీడీపీకి ఓటుతో బుద్ధి చెప్పండి



మాట్లాడుతున్న ఎన్నికల ఇన్‌చార్జ్ అనంతరాజు

మడకశిరరూరల్: ఆచరణకు సాధ్యంకాని హామీలతో ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్న టీడీపీ కూటమికి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్ అనంతరాజు, రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వారు వివిధ గ్రామాలకు చెందిన నాయకులతో సమావేశమయ్యారు.ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఏడీసీసీ బ్యాంకు మాజీ ఉపాధ్యక్షులు ఆనందరంగారెడ్డి, నాయకులు ఎస్ఎం క్రిష్టప్ప, నర్సేగౌడ్, హనుమంతరాయప్ప, చిరంజీవి పాల్గొన్నారు.



చౌళూరు పంచాయతీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి



అమరాపురం మండలం గుణేహళ్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



రొళ్ల మండలం కాకిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ఏఆర్ రొప్పంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు



19వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ



గుడిబండ: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మహిళా కార్యకర్తలు

జోరుగా ఎన్నికల ప్రచారం

సాక్షిబృందం: ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు దూసుకెళ్తున్నాయి. హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకే ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థులు దీపిక, ఈరలక్కప్ప, ఎంపీ అభ్యర్థి శాంతమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తేనే సంక్షేమాభివృద్ధి సాధ్యమని వివరించారు.